

ఈ కథ ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, ఫిబ్రవరి 4, 1959 సంచికలో ప్రచురితమయ్యింది.

"నిర్మలా!"

.. ...

"నిర్మలా దేవీ!"

అదిరిపోయి చెదిరిపోయింది శాంతమ్మ. అసహజమైన ఆ సంబోధన ఏదో కల్లోలం చెలరేగించేటట్లుగా తోచిందామెకు. తనకు తెలియకుండానే చిరుచెమటలు ఆమె దేహాన్ని కప్పివేశాయి. ఆ సంబోధనలోని గంభీరత ఆమెను కదలించివేసింది.

"క్లబ్బుకు వెళ్లింది!" కొంచెం ముక్తసరిగానే సమాధానం ఇచ్చింది.

"ఎవరినడిగి?" ఉరిమాడు శివానందు.

"రోజూలాగే!" నోరు జారినందుకు నాలుక కరుచుకుంది శాంతమ్మ.

"అయితే నేను రోజూ సాయంకాలం షికారుకు పోతుంటే ఈమె క్లబ్బులకు వేంచేస్తోందన్న మాట. నాకు తెలియకుండా. ఏమి స్వాతంత్రం ఏమి వినయం! నలుగురి దృష్టిలోనూ పడుతున్నాననైనా భయం లేకుండా రాద్ధాంతం సాగిస్తోందన్నమాట! ఈ విషయం తండ్రికి తెలిస్తే ఎంతగా బాధపడతాడనైనా లక్ష్యం లేకుండా ఆడుతోందన్నమాట అట. నా బుద్ధి తక్కువతనం కాకపోతే ఆడదానికి స్వేచ్ఛ ఇమ్మని ఎవరు చెప్పారు!

"అమ్మాయిని అలా క్లబ్బులకూ, నాటకాలకు పొమ్మని స్వేచ్ఛగా వదిలెయ్యకపోతే కాస్త అదుపులో పెట్టుకోలేకపోయావు! చేతులు కాలాక ఆకులు పట్టుకుందామనుకున్నావా?" గంభీర వదనం ఎర్రబారింది. హృదయంలో అగ్నిగోళాలు ఇమిడిపోతున్నాయి.

"ఇంతకీ ఏమయిందండీ ...?"

"తెలివి తక్కువ దద్దమ్మలకు హరికథలు చెప్పగలరు మీరు. అరవై సంవత్సరాల జీవితంలోని అనుభవాన్ని మోసిన శివానంద్ దగ్గరా మీ నాటకాలు! అదుపులో పెట్టుకోలేకపోతే చెప్పు. అప్పుడు నేను చూసుకుంటాను తతంగం. మొక్కయై వంగనిది మానై వంగదు, శాంతీ! నీ కిప్పుడిదంతా ముద్దుగా తోచినా తన ప్రవర్తన మితిమీరిందంటే నోరు చప్పరించాల్సి వస్తుంది. తెలుసుకుని కాస్త బుద్ధి చెప్పు! రేపటి నుంచి ఈ క్లబ్బు వ్యామోహాలూ, గాలి షికార్లూ బందు చెయ్యవలసి వస్తుందని చెప్పు! అవసరమైతే కాలేజీ చదువు కూడా!" కంఠం రుద్ధమయింది తండ్రిగా అపజయాన్ని పొందుతున్నందుకు.

కుక్కిన పేనులా అయిపోయింది శాంతమ్మ పరిస్థితి. మారు మాట్లాడకుండా వెనుతిరిగి పోయిందామె.

000

"నిర్మలా!"

"ఆఁ...!"

"నీకు చెప్పవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. అయితే అవి ఆజ్ఞలుగా తీసుకోలేకుంటే సలహాలుగా తీసుకో! ఏమైనా నేను చెప్పేవి అనుసరించక తప్పదు!" కాస్సేపు నిశ్శబ్దంతో స్తబ్దుగా ఉండిపోయారాయన.

అటువంటి సమయంలో తండ్రి మాటలకై ఆకట్టుకుని కూర్చోవడం దుస్సహమనిపించింది నిర్మలకు. అయితే ఆయన చెప్పబోయే విషయాలు అంతకుముందే తల్లి వలన తెలుసుకుంది. వాటిని అలక్ష్యం చేయడంవలననే - తండ్రి యత్నానికి మూలం. కంఠం సరిదిద్దుకుని అందుకున్నారాయన.

"ఈమధ్యన నీ ప్రవర్తన నన్ను సంతోష పెట్టడంలేదు, నిర్మలా! స్త్రీ జీవితంలో.. ప్రతి వ్యక్తి వాంఛించేది సహజమైన సిగ్గు, వినయమూనూ.

# విడిచివెళ్లినవిరాగి

తనికెళ్ల జగన్నాథం

అవి రాను రానూ నీలో క్షీణించిపోతున్నాయి. పైగా నన్ను కూడా అలక్ష్యం చేసి తిరుగుతున్నావు. అసభ్యతకు దోవతీసే పనులు చేయకూడదు. నిర్మలా! శిష్ట సమాజంలోని వారం, మనకసలు తగదు. ఇంటర్‌లో క్లాసు సంపాదిస్తావని, ఎం.బి. చదువుతావని ఆశతో ఉన్న నేను ఈ సమయంలో నీ ప్రవర్తన తెలిశాక ఎంతగా గాయపడ్డానో తెలుసా! ఇటువంటి సభ్యతకు విరుద్ధమైన పనులు చేస్తావని అనుకోలేదు. నిర్మలా! కనీసం ఊహించనైనా లేదు, నిర్మలా!" అవ్యక్తమైన విషాదం వ్యక్తమవుతోంది ఆ మాటలలో.

"క్షమించు, నాన్నా!" ప్రాధేయపడ్డట్లుగా అంది.

"క్షమిస్తే మానుకుంటావా నీ దుష్కృత్యాలు?"

"క్లబ్బుకు వెళ్లడం మానుకోవడమేనా ...."

"అంతే కాదు!"

"మరి?"

"కాలేజీ కూడా!"

అచేతనమై ముగ్ధత్వంలో మూర్తీభవించే సౌందర్యరాశిని లోలోపలే దాచివేసుకుంది. వినిర్మల వదనారవిందంలో అస్పష్టమైన చీకటి ఛాయలేర్పడ్డాయి. హృదయంలో ఏపుగా పెరిగిన ఆశాలత చిరిగిపోయినట్లుగా మనోభావాలు పైకి వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఒక్కసారి శరీరం రంగును మార్చుకుంది. ధవళత పోయి రాగరంజితమైంది.

కాస్సేపు నిశ్శబ్దం వారిమధ్య అధికారం వహించింది.

"అసంభవం, నాన్నా!" తనకు తెలియకుండానే అనేసింది.

శివానందంగారి అనుమానం నిజమయింది. తోటి లెక్చరర్ చెప్పగా ఇంకా అపనమ్మకం దేనికి? ఒకనాడు ఆకస్మికంగా రోడ్డుమీద తగిలి, "మీ నిర్మల ఇంగ్లీషు లెక్చరర్ శేఖర్‌తో ప్రణయం సాగిస్తోంది. కాలేజీలో చాలా గల్లంతు తెచ్చే వ్యవహారంలాగుంది చూస్తుంటే. రిటైర్డ్ పోలీసు ఆఫీసరు కూతురై ఉండి కూడా, చేతకాని దద్దమ్మలాగు అదుపులో పెట్టుకోలేకపోయావంటే ఆశ్చర్యమే. కాలేజీ కుర్రకారు ఊరుకోకుండా పేపరులో కెక్కించే తతంగంలో ఉన్నారు!" ఇలా అన్న మాటలు క్రమం తప్పకుండా చెవులలో రింగులు తిరుగుతున్నాయి. అగ్నిగోళాలు లోపల పగులుతున్నాయి కాబోలు కందగడ్డలా తయారాయిందాయన మొహం.

"అసంభవం .... ఎందుకు అసంభవం? నీ రహస్యాలన్నీ నాకు తెలియవని అనుకున్నావు కాబోలు. నాకు తెలియకపోతే లోకానికైనా తెలియదనుకున్నావా? మీ లెక్చరర్ శేఖర్‌తో తననే పెళ్లి చేసుకుంటానని వాగ్దానం ఇచ్చావటగా! అయితే చాలా దూరం పోయిందన్నమాట వ్యవహారం! ఇంత అవినీతికి పాల్పడతావని కలలోనైనా ఊహించలేదు, నిర్మలా! నైతిక నియమాలకు లొంగి ప్రవర్తించవలసిన అవస్థ నీకు లేదులాగుంది. సాంఘిక ధర్మాలను త్రోసిపుచ్చి అవినీతికీ, అధర్మానికీ, అనాచారానికీ లోబడుతున్నావంటే మానసిక దౌర్బల్యతను పెంచుకుంటున్నావన్నమాట! పైగా మన కారులో అతనిని తన బసకు దిగబెడుతున్నావటగా! ఏమైనా సరే, రేపటి నుంచి నీవు ఈ ఆటలకు స్వస్తి చెప్పాల్సిందే!" తన స్థిరాభిప్రాయాన్ని వ్యక్తపరిచాడు.

శేఖర్ విషయం తండ్రికి తెలియదనుకున్న నిర్మల అచేష్టితయై వింటోంది.

"పరీక్షలు నాలుగు నెలలలోనే ఉన్నాయి కనుక సెలవు పెట్టేయి కాలేజీకి. అవసరం అయితే అటెండెన్సుకోసం యూనివర్సిటీకి డబ్బు కడతాం. నీవు క్లాసు సంపాదిస్తావని ఆశించాను కానీ ఇప్పుడా ఆశ పూర్తిగా నశించిపోయింది. దానికీ నీ ప్రవర్తనే కారణం. ఈ కొద్ది కాలం అయినా శ్రద్ధగా చదివి కనీసం ప్యాసు అన్నా అవుతావేమోనని ఆశిస్తాను. వచ్చే ఏడాది ఏమయినా నీవు మెడిసిన్‌లో జాయినవడం తథ్యం! పదివేలు కాకపోతే ఇంకో పది ఇస్తాను విరాళం. ఇచ్చి సీటు సంపాదించే బాధ్యత నాది. ఇప్పుడు పాసయ్యే బాధ్యత నీది! తరువాత అంటే చదువైన తరువాత ఏ ఫారిన్ రిటర్న్‌డుతోనో పెళ్లి చేస్తాను. నా ఈ ఆశలకు భంగం కలగడం ఎన్నటికీ జరగకూడదు. మీ క్లాస్ టీచర్ శేఖర్ కదూ! సెలవు చీటీ వ్రాసి పంపెయ్యి మాట్లాడకుండా!" సమాధానం ఆశించకుండానే వెనుతిరిగి లోపలకు పోయారాయన.

పిడుగులాంటి ఆజ్ఞ .... దుర్భరం .... దుస్సహం. కాలేజీ మాని ఇంట్లోనే గడపడమెలాగు? ముఖ్యంగా పూర్ణ స్వాతంత్ర్యాన్ని అనుభవించిన నిర్మల ఈ ఆజ్ఞలు, కట్టుబాట్ల మధ్య జీవించడమెలాగ? అసంభవం! అయితే తండ్రిని ధిక్కరించి చేయగలిగిందేముంది? పరిస్థితులు మరీ విషమిస్తాయి. ఇకనుంచి తను కేవలం రాణివాస స్త్రీయే! జైలులో బందీయే! పంజరంలో చిలకయే! అబ్బ .... ఇవన్నీ తలుచుకుంటూంటే గుండె బరువెక్కిపోతోందామెకు. హృదయంలో పెనుతుఫాను .... మనస్సులో సుడిగుండం .... ఆత్మలో అవమానంతో నిండిన వేదన. కనుకొలకులలో కన్నీటి కణాలు కొన్ని చోటుచేసుకున్నాయి.

అన్యమనస్కురాలై అలాగే కూర్చుండిపోయిందామె కొంతసేపు. ఇంతలో సంధ్య చీకటులు అలుముకుంటున్నాయి. పడమటి కొండల వెనుక ఆకాశం అరుణారుణమైంది. పక్షులు బారులు తీర్చి నీలాల నింగిపై స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. ఇక ఈ ప్రకృతి శోభలోని మాధుర్యం కూడా తనకు కరువే అనుకుంది నిర్మల.

మెడికల్ లీవ్ పెడితేగానీ ఒప్పుకోరంటే శివానందంగారు స్వయంగా డాక్టరు వద్దకు పోయి ఎలాగైతేనేం సంపాదించారు దానిని. డ్రైవరు దానిని తీసుకుని కారులో పోతుంటే కాలేజీ విద్యార్థులు .... ముఖ్యంగా శేఖర్ అనుమానించాడు ఏం జరిగిందోనని. సైకిలు మీద తను వస్తుంటే ఈ కారు పక్కనుంచి దుసుకుపోయింది. కానీ దానిలో నిర్మల కనిపించలేదు. కొంత కంగారుపడ్డాడు శేఖర్.

సవినయంగా జరిగిందంతా చెప్పాడు డ్రైవర్ రాజు. ఆ వినయంలోనే వేళాకోళం ప్రస్ఫుటంగా వ్యక్తమవుతోంది. శేఖర్ కొంచెం అవమానంతో బాధపడ్డా, పైకిమాత్రం కనిపించనీయలేదు. తనకూ, నిర్మలకూ ఎడబాటు తప్పదు. ఒకవేళ తనకు కనిపించినా మాట్లాడదు మూగనోము పడుతుంది. అయినా కాలేజీ వాతావరణం కూడా బాగాలేదు. విద్యార్థులంతా తనని గేలి చేస్తున్నారు. ఏవేవో బోర్డులమీద రాస్తున్నారు. తనని ఒక ఆట ఆడిస్తున్నారు. గౌరవ వినమ్ర భావాలు ఎప్పుడో నశించిపోయాయి. అయితే ఇంకా తనెందుకో ఇక్కడుండటం అనిపించింది శేఖర్‌కు.

000

నిర్మలకు దినచర్యలన్నీ రొటీన్‌గా జరిగిపోతున్నాయి. ఇల్లే తన కైలాసంగా ఉందామెకు. పొట్టకు మించిన పరమార్థం మరి లేనట్లుగా అయిందామెకు. కనీసం స్థానభ్రంశం అన్నా ఉంటే కొంత వేడి తగ్గుతుంది. రోజురోజుకూ అశాంతి ఎక్కువైపోతోంది. శేఖర్‌ని తలచుకుంటూంటే ఏవో విషాదవంతమైన మూగ భావాలేర్పడుతున్నాయి. ఒక మూల తండ్రికి తనమీద ఉన్న సదాశయాలకు సంతృప్తి మరొక మూల శేఖర్ తనకు దూరమవుతున్నాడనే అసంతృప్తి ఇవన్నీ హృదయాన్ని కలచివేస్తున్నాయి. ఏదో విధమైన బాధ తనని కృశింపజేస్తోంది. ఎంతగా ప్రయత్నించినా ఆ మమత చెరపరానిదైపోతోంది. తన మనస్సులో శేఖర్ అంతకంతకూ దగ్గరవుతూనే ఉన్నాడు.

పుస్తకాలు తీస్తోంది కానీ చదవలేకపోతోంది. ఒకవేళ చదివినా బోధపడటంలేదు. దృష్టి అంతా శేఖర్‌పైననే. ఆ విధంగా ఏకాంతంలో లీనమౌతూంటుంది. అప్పుడప్పుడూ కన్నీటి ధారాస్రవంతులు కట్టలు తెగి బయల్పడుతున్నాయి. అప్పుడే జీవితంలోని కొన్ని పరమసత్యాలు తెలుసుకోగలుగుతోందామె.

000

ఎప్పుడూ మేడమీదకు రాని శివానందంగారు ఆ రోజున వచ్చారంటే కొంచెం ఆశ్చర్యంగానే తోచింది నిర్మలకు. కొంచెం ఆనందం తొంగి చూస్తోంది. అంతటి గంభీరత్వంలోనూ ఆయన ఏవో చెప్పబోయి, ఫాన్ వేసుకుని కాస్సేపు కూర్చున్నారు సోఫాలో. నిర్మలకిదంతా వింతగా తోచింది. అయినా ముందర తాను పలకరించదలచుకోలేదు.

కాసేపాగి "చదువెలాగుంది, నిర్మలా?" ప్రశ్నించాడు.

"బాగానే ఉంది!" ముక్తసరిగా సమాధానం ఇచ్చింది.

"కాలేజీకి వెడతావా ఏంటి?"

"వద్దు, నాన్నా!"

"ఏం? నీ మీద నాకు ప్రత్యేకమైన కక్ష ఏమీ లేదు, నిర్మలా! కేవలం నిన్ను బాధించే ఉద్దేశం మీద కాదు నిన్ను కాలేజీకి వెళ్లకుండా ఇంట్లో ఉంచింది. లోకం పోకడలు తెలియక నన్ను కఠినుడుగా, కసాయివాడుగా భావించావు నీవు. అయినా నీవు నన్నొకప్పుడర్థం చేసుకుంటావులే ఆ రోజు తప్పకుండా వస్తుంది. నీ బాగుకోసమే నే నలా చేశానని తెలుసుకో నిర్మలా! పోనీ, ఇప్పుడు తెలుసుకోకపోయినా ఇక ముందైనా తెలుసుకుంటావులే! నీ ఏకాంతం ఇంకా మితిమీరకూడదు. తప్పకుండా కాలేజీకి వెళ్లాలి. ఈ చిన్న కోర్కెను నెరవేర్చలేకపోతే ఈ ముసలి తండ్రి మనస్సు బాధపడుతుంది, నిర్మలా!" అనురాగం ఉట్టిపడుతోంది ఆ మాటలలో.


ఒప్పుకోక తప్పిందికాదు నిర్మల. అయితే లోపల వెళ్లాలని ఉన్నా, మొదటే వ్యక్తపరచలేదు ఆ అభిప్రాయం.

మామూలుగానే కారు నిర్మలను తీసుకుపోతోంది కాలేజీకి. హృదయంలో ఆవేదన, ఆరాటనలు మిళితమైనాయి. ఒకవైపు శేఖర్‌ని చూడాలనే ఆతురత ... మరోవైపు అలా కూడదనే ఉద్దేశంతో వెలువడే అస్పష్టమైన చికాకు. కారు హారన్ కొట్టుకుంటూ ముందుకు దూసుకుపోయి కాలేజీ ఆవరణలో ఆగింది.

"శేఖర్ ట్రాన్స్‌ఫరైపోయి వెళ్లిపోయాడు!" నేస్తం సరూ మాటలు.

గాఢమైన నిట్టూర్పు నోటిని అర్చివేసింది. మొహం ఎర్రవారిందామెకు.

■




## వింత కారు

ఇంగ్లండుకు చెందిన యురి గెల్లర్ తన కారుని అపూర్వమైన కారుగా తీర్చిదిద్దా లనుకున్నాడు. దాంతో తన 1976 కాడిలాక్ కారు బోనెట్‌కి స్పూన్లు, ఫోర్కులను వెల్డింగ్ చేశాడు. మొత్తం అలా అయిదు వేలకు పైగా బోనెట్‌మీద ఉన్నాయి. వీటిలో కొన్ని ప్రెసిడెంట్ కెన్నడీ, ఎల్విస్ ప్రెస్లీ, సెల్వడార్ డాలీ మొదలైన ప్రముఖులు వాడినవికూడా ఉన్నాయి. వైట్ హౌస్‌కి వచ్చే అతిథులకి వాడినవే ఎక్కువ భాగమట. బోనెట్ నిండాక కారు టాపుమీద ఇప్పుడు కొత్తవాటిని వెల్డింగ్ చేయిస్తున్నాడు. మీరు ఇంగ్లండుకి వెళితే సానింగ్ అనే ఊళ్లో తిరిగే ఈ కారుని చూడవచ్చు.

-డి. పద్మజ

